www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 16 మార్చి 2025



ఉద్యోగమేళాలో 25మంది ఎంపిక

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి



శ్రీకాళహస్తి పట్టణంలోని స్వామి విద్యాప్రకాశానంద ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో జేకేసీ, రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉద్యోగ మేళాలో 25మంది ఎంపికయ్యారు. ఈ ఉద్యోగమేళాలో ఐదు కంపెనీల ప్రతినిధులు పాల్గొనగా, సుమారు 50మంది నిరుద్యోగులు హాజరయ్యారు. కంపెనీల ప్రతినిధులు వీరికి ముఖాముఖి నిర్వహించి, అందులో ప్రతిభ చూపిన 25మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసుకున్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామకపత్రాలు అందజేశారు. వీరికి నెలసరి వేతనం రూ.15వేల నుంచి రూ.20వేలు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ ఉద్యోగమేళాలో కళాశాల ప్రిన్సిపాల్ నాగరాజానాయుడు, వైస్ ప్రిన్సిపల్ నరసింహవర్మ, జేకేసీ కో-ఆర్డినేటరు టి.గంగారాం, జేకేసీ ఎఫ్టీఎం పి.గిరిజమ్మ, సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఐదారు కిలోమీటర్లు నడిస్తేనే ఈ చిన్నారులకు చదువు

విద్యాశాఖలో ఏ నిర్ణయం చేసినా దళిత, గిరిజన, పేద విద్యార్థులు విద్యకు దూరం కాకుండా ఉండాలి..విద్యారంగంలో సంస్కరణల పేరుతో జీవో 117 తీసుకొచ్చి విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్నారన్న కారణం చూపుతూ 3, 4, 5 తరగతుల వారిని ఆరేడు కిలోమీటర్ల దూరంలోని ప్రాథమికోన్నత పాఠశాలల్లో విలీనం చేయడం పట్ల జిల్లావ్యాప్తంగా వ్యతిరేకత వ్యక్తమవుతోంది. పంచాయతీకి ఒక మోడల్ పాఠశాలను తీర్చిదిద్దుతామని విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ చెబుతుంటే, ఈ నిర్ణయం వల్ల దళిత గిరిజన వాడల్లో విద్యార్థులు పూర్తిగా బడికి దూరమయ్యే ప్రమాదం లేకపోలేదు.

ఇవేం మో'డల్' నిర్ణయాలు

ఐదారు కిలోమీటర్ల దూరంలో విలీనం

దళిత గిరిజన బిడ్డలు విద్యకు దూరం

30 పాఠశాలల్లో 'మెర్జ్'కు కసరత్తు

ఊళ్లో 'బడి' ఉండాల్సిందే : స్థానికులు

ప్రజాశక్తి - కెవిబిపురం

కెవిబిపురం మండలంలో ఎక్కువమంది గిరిజనులు కొండ పక్కన నివాసం ఉండేవారు. గతంలో వారి పిల్లలు తల్లిదండ్రులతోనే పనులకు వెళ్లేవారు. అయితే వారి బతుకులు మారాలని ప్రభుత్వ పాఠశాలను ఏర్పాటు చేశారు. మెల్లమెల్లగా చిన్నారులు పాఠశాలకు రావడం మొదలుపెట్టారు. అయితే కూటమి ప్రభుత్వం విద్యాసంస్కరణల పేరుతో వారిని బడికి దూరం చేసే చర్యలు తీసుకుంటున్నారు.

మండలంలో మొత్తం ప్రభుత్వ పాఠశాలలు 75 ఉన్నాయి. అందులో ఒకటి కేజీబీవీ, రెండు ఏపీ ఆదర్శ పాఠశాల హై స్కూళ్లు ఉన్నాయి. మండలంలో ఒకటి నుండి పదో తరగతి వరకు చదివే విద్యార్థుల సంఖ్య 4962 మంది ఉన్నారు. అందులో అబ్బాయిలు 2493, అమ్మాయిలు 2469మంది. ఇందులో ఎస్సీ విద్యార్థులు 1898 మందిలో అబ్బాయిలు 948 అమ్మాయిలు 950. ఎస్టి విద్యార్థులు 901 మందిలో అబ్బాయిలు 469, అమ్మాయిలు 432మంది. బి సి విద్యార్థులు 1961 మంది అందులో అబ్బాయిలు 975 అమ్మాయిలు 986. ఓ సి విద్యార్థులు 204 అందులో అబ్బాయిలు 101 అమ్మాయిలు 101 మంది విద్యార్థులు చదువుతున్నారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడి ప్రతి పంచాయతీకి ఒక మోడల్ స్కూల్ ఏర్పాటు చేయాలనే నేపథ్యంతో ఏ పాఠశాలలో అయితే విద్యార్థులు 60 మందికి తక్కువ ఉంటారో అని గుర్తించారు. మండలంలో 30 ఉన్నాయి. ఈ పాఠశాలల్లో చదువుతున్న 3, 4, 5 తరగతుల విద్యార్థులను క్లస్టర్‌వైజ్‌గా ఒకే హైస్కూల్‌కు పంపించేందుకు పిల్లల తల్లిదండ్రులతో నాయకులు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అభిప్రాయాలను సేకరించి విద్యాశాఖ ఉన్నతాధికారులకు పంపిస్తామని సమావేశాల్లో చెబుతున్నారు.

ఐదు కిలోమీటర్ల దూరం పంపలేం : శ్రీనివాసులు, ఎస్‌టి కాలనీ

మాది ఎస్‌ఎల్‌పురం ఎస్టీ కాలనీ. మా గ్రామంలో ఉన్న పాఠశాలకు పోవాలంటేనే మా పిల్లలు ఏడుస్తారు. అలాంటిది 3, 4, 5 తరగతుల పిల్లల్ని దాదాపు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాఠశాలకు పంపడం కష్టమవుతుంది. మా పిల్లల్ని అంత దూరం పంపించడం కుదరదని తల్లిదండ్రులంతా కలిసి ధర్నా నిర్వహించాం.

మా బడిని కాపాడుకుంటాం : సూరమాల గ్రామస్తులు

మారుమూల ప్రాంతం మాది. సూరమాల పాఠశాలలో 25 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో 3, 4, 5 తరగతుల విద్యార్థులు 16 మంది ఉన్నారు. విద్యాశాఖ నిర్ణయం ప్రకారం దాదాపు ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాఠశాలకు 16 మంది పిల్లలు వెళ్లాలి. మిగిలిన తొమ్మిది మంది పిల్లల్ని ఏ చేస్తారో తెలియదు. మా పిల్లలను దూరంగా ఉండే పాఠశాలకు పంపించలేం. ధర్నా చేసైనా మా బడిని మేం కాపాడుకుంటాం.

కలెక్టర్ దృష్టికి తీసుకెళతాం : లక్ష్మీపతి, ఎంఎఇఒ

ప్రతి పాఠశాలలోనూ విద్యాకమిటీ ఛైర్మన్, నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులతో సమావేశం నిర్వహిస్తున్నాం. వారి దగ్గర నుంచి సమాచారాన్ని సేకరించి కలెక్టర్ దృష్టికి తీసుకెళతాం



తల్లిదండ్రుల నిరసన

రేపటినుంచి 'పది' పరీక్షలు

జిల్లాలో 164 పరీక్షా కేంద్రాలు

28,656 మంది విద్యార్థులు

'ప్రజాశక్తి'తో డిఇఒ కెవిఎన్ కుమార్



ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

పకడ్బందీగా పది పరీక్షలు రాసేందుకు ప్రశాంతమైన వాతావరణాన్ని నెలకొల్పినట్లు తిరుపతి జిల్లా డిఇఒ కెవిఎన్ కుమార్ వెల్లడించారు. ఈనెల 17నుంచి 31 వరకు జరగనున్న నేపథ్యంలో 'ప్రజాశక్తి' డిఇఒను పరీక్షల ఏర్పాట్లపై ఇంటర్వ్యూ నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాస్ కాపీయింగ్‌కు తావులేకుండా ముందస్తు ప్రణాళికతో పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వసతులు కల్పించామన్నారు. జిల్లావ్యాప్తంగా 164 కేంద్రాల్లో 28,656 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 15,455 మంది, ప్రైవేట్‌కు సంబంధించి 11,548 మంది, 634 మంది ప్రైవేట్ విద్యార్థులు 1.019 మంది ఓపెన్ స్కూల్ విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు చెప్పారు. వీరికి ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకూ పరీక్ష ఉంటుందని తెలిపారు. 1904 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తారన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద జిరాక్స్ సెంటర్లు మూతవేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. డ్యూటీలో ఉన్న ప్రతి ఉద్యోగి గుర్తింపు కార్డులతో విధులకు హాజరుకావాలన్నారు. 1476 మంది ఇన్విజిలేటర్లతో పాటు, పోలీసు, రెవెన్యూ, విద్యాశాఖకు చెందిన ముగ్గురు అధికారులతో, ఆరు ఫ్లయింగ్‌స్క్వాడ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 30 సిట్టింగ్ స్క్వాడ్, 164 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 163 మంది డిపార్టుమెంట్ ఆఫీసర్లు, 41 మంది కస్టోడియన్లు, 11 మంది రూట్ ఆఫీసర్లు, ఆరుగురు రూట్ ఆఫీసర్లు విధుల్లో ఉంటారని తెలిపారు. జిల్లాలోని 39 పోలీసు స్టేషన్లలో ప్రశ్నాపత్రాలు ఉన్నాయని, శనివారం సిబ్బందితో సమావేశం నిర్వహించి పరీక్షల నిర్వహణపై పూర్తి అవగాహన కల్పించామన్నారు. ఏదైనా ఫిర్యాదులు వస్తే స్వీకరించడానికి 7569787131 ఫోన్ నంబర్‌కు తెలియజేయాలన్నారు.

శెట్టిపల్లిలో సిపిఎం ప్రజాచైతన్యయాత్ర

సమస్యల వెల్లువ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుపతి కార్పొరేషన్ పరిధిలోని శెట్టిపల్లిలో సిపిఎం శనివారం సాయంత్రం ప్రజాచైతన్య యాత్ర నిర్వహించింది. ఈ యాత్రలో భాగంగా శెట్టిపల్లి దళితవాడలోనూ, గ్రామంలోనూ గడప గడపకూ తిరిగి ప్రజా సమస్యలను తెలుసుకుంది. ఈ యాత్రకు సిపిఎం నగర కార్యదర్శి వేణు అధ్యక్షత వహించారు. సిపిఎం నాయకులు బుజ్జమ్మ, మల్లికార్జున్, ఎన్‌డి శ్రీను, మొయిద్దీన్‌తో పాటు 'ప్రజాశక్తి' మేనేజర్ సిఎస్ ప్రసాద్, గుణశేఖర్, శ్రీనివాస్, మునిమోహన్, నాగరాజు, సురేష్, చలపతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని మునిరాజమ్మ మాట్లాడుతూ తన భర్త డయాలసిస్ పేషంట్‌గా ఉన్నపుడు పదివేలు ఇచ్చేవారని, చనిపోయి ఏడాదైనా తనకు వితంతు పింఛన్ ఇవ్వలేదని, కలెక్టర్ చుట్టూ తిరుగుతూనే ఉన్నామని చెప్పుకొచ్చారు. దళితవాడకు 4 ఎకరాల రెండు సెంట్లను స్మశానానికి కేటాయించారని, శెట్టిపల్లిలోని ఓ పెత్తందారు ఆక్రమించుకోవడంతో ఎకరా రెండు సెంట్లు మాత్రమే మిగిలిందని, శ్మశానానికి వెళ్లడానికి దారి లేదని, పదేళ్లుగా న్యాయ పోరాటం చేస్తున్నట్లు వివరించారు. అదే వాడకు చెందిన ఆదెమ్మ (70)కిడ్నీ వ్యాధితో ఒంటరితనంతో బాధపడుతోంది. పింఛన్ అర్హురాలైనా ఇంతవరకూ పట్టించుకోలేదని వాపోయింది. ప్రసాద్, మునెమ్మ మాట్లాడుతూ పదేళ్ల క్రితం శెట్టిపల్లి గ్రామంలో వ్యవసాయ కూలీలుగా ఉండేవాళ్లమని, రియల్‌ఎస్టేట్ వల్ల పంటలు పండే పొలాల్లో ప్లాట్లు వేయడంతో ఉన్న ఉపాధి పోయిందని, తిరుపతి సమీపంలోని తోపుడుబండ్లు, హోటళ్ల పని, భవన నిర్మాణ పనులకు వెళుతున్నామని చెప్పారు. దళితవాడలో ఒక్కరికీ సెంటు భూమి లేదని, పక్కా ఇళ్లు లేవని, ఉపాధి పనులు చూపించాలని వేడుకొన్నారు.

దళితులంటే చిన్నచూపు : సిపిఎం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

పాలకులకు దళితులంటే చిన్న చూపనీ, దళిత వాడల్లో నేటికీ గుడి, బడి, శ్మశానాలకు సరైన దారి సౌకర్యం లేదని సిపిఎం శ్రీకాళహస్తి ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి ఆగ్రహం వ్యక్తం చేశారు. తొట్టంబేడు మండలంలోని చియ్యవరం గ్రామంలో మూడో రోజు సీపీఎం ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. చియ్యవరం దళితవాడ విద్యార్థులు ఉన్నత పాఠశాలకు వెళ్లేందుకు సరైన దారి సౌకర్యం లేకపోవడం దళితులపై చిన్న చూపుకి నిలువెత్తు నిదర్శనమన్నారు. దళితవాడ వీధుల్లో మురుగునీరు ఏరులై పారుతోందనీ, గ్రామస్తులు వ్యాధుల బారిన పడుతున్నారని వాపోయారు. జిల్లా కలెక్టర్ ఆర్వో ప్లాంట్ ఏర్పాటుకు అనుమతినిచ్చినా అధికారులు ఇప్పటివరకు ఆ దిశగా చర్యలు చేపట్ట లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలకులు ఇకనైనా దళితుల బాగోగుల గురించి ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు పెనగడం గురవయ్య, వై కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పక్కా ఇల్లూ లేదంటూ సిపిఎం బృందానికి చెబుతున్న దళితుడు

ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలి

'స్వర్ణాంధ్ర..స్వచ్ఛఆంధ్ర'లో ర్యాలీలు, ప్రతిజ్ఞలు



తిరుపతిలో భారీ ర్యాలీ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్, యంత్రాంగం

'స్వర్ణాంధ స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమములో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని జిల్లా ప్రత్యేక అధికారి కోన శశిధర్ తెలిపారు. శనివారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియం నందు నిర్వహించిన స్వర్ణాంధ్ర స్వఛాంద్ర కార్యక్రమంలో విద్యాశాఖ కమిషనర్, జిల్లా ఇన్చార్జి అధికారి కోన శశిధర్, కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్, నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, ఎస్వీ యూనివర్సిటీ విసి లు ప్రొ.ఉమ,అప్పారావు పాల్గొన్నారు. ఇన్చార్జి ప్రత్యేక అధికారి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగస్వామ్యమై ముందుకు వెళ్లాలని తెలిపారు. శుభ్రతపై ప్రతి ఒక్కరిలోనూ మార్పు రావాలని అన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పంచాయతీ కార్యాలయాలు, ప్రభుత్వ శాఖలు, పాఠశాలలు, రైల్వేస్టే షన్, బస్టాండ్, ఇతర ప్రదేశాల్లో ప్రతి మూడవ శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛంద కార్యక్రమాన్ని జరుపుతున్నామన్నారు. ప్లాస్టిక్‌రహిత స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలన్నారు. అనంతరం కలెక్టర్ అందరితో ప్రతిజ్ఞ చేయించారు. టౌన్‌క్లబ్ సర్కిల్ వరకూ ర్యాలీ నిర్వహించారు.


- పర్యావరణ పరిశుభ్రత తిరుపతి జిల్లా పోలీసు శాఖ లక్ష్యమని, పోలీసు స్టేషన్ అంటే దేవాలయంతో సమానమని యంత్రాంగం స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. పోలీసు స్టేషన్లలోనూ, సర్కిల్ ఆఫీసుల్లోనూ, ఎస్‌డిపిఒ ఆఫీసుల్లోనూ పనికిరాని సామాన్యను తొలగించి శుభ్రపరిచారు.
- తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో డిఎంహెచ్ఒ ఆదేశాల మేరకు పరిసరాలను శుభ్రం చేశారు. జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారిణి డాక్టర్ శాంతకుమారి, అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శ్రీనివాసుల రెడ్డి పాల్గొన్నారు.
- తిరుపతి విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ పి.సురేంద్రనాయుడు ఆదేశాల మేరకు ఆపరేషన్ డివిజన్ ఇంజినీర్ ఇఇ వి.చంద్రశేఖర్‌రావు సూచనల మేరకు గోవిందరాజస్వామి గుడి దగ్గర వెస్ట్ సెక్షన్‌లో పరికరాలనున శుభ్రం చేశారు.
- కాలుష్య రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఇఎస్ఐ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.శ్యాంబాబు పేర్కొన్నారు. సింగల్ యూ జ్ ప్లాస్టిక్ ను ప్రతి ఒక్కరూ దూరంగా ఉండి, గుడ్డ సంచులను వాడాలని, ఆసుపత్రులు, సంస్థలు, ఇళ్ళు, పని ప్రదేశాల్లో తడి చెత్త, పొడి చెత్త,బయో మెడికల్ వ్యర్థాలను వేర్వేరు చేయడం వంటి పద్ధతులను పాటించాలని కోరారు.
- పుత్తూరు మున్సిపల్ కమిషనర్ మంజునాథ్‌గౌడ్ ఆధ్వర్యంలో మున్సిపల్ పార్కు, మార్కెట్లో మాస్ క్లీన్ డ్రైవ్ ఇచ్చి, పిచ్చి మొక్కలను తొలగించారు. ఛైర్మన్ ఎ.హరి, వైస్‌ఛైర్మన్లు డి.జయప్రకాష్, డి.శంకర్ పాల్గొన్నారు.
- చిన్నగొట్టిగల్లులో తహశీల్దార్ జనార్ధన్‌రాజు, ఎంపిడిఒ గిడ్డయ్య, ఈవోఆర్‌డి సోమశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.

శ్రీకాళహస్తి వైసీపీలో 'జోష్'

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి



శ్రీకాళహస్తి నియోజకవర్గ వైసీపీ శ్రేణుల్లో జోష్ నెలకొంది. ఆ పార్టీ అధికారం కోల్పోయినాకష్టకాలంలో అండగా ఉన్న పలువురికి నియోజకవర్గ స్థాయి పదవులు లభించాయి. ఆ మేరకు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి 25 మంది కార్యకర్తలకు నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులుగా శనివారం నియామక పత్రాలు అందాయి. పదవులు పొందిన వారిలో సూరా సురేష్(యువత విభాగం), టీ. పర్వీన్ (మహిళా విభాగం), శ్రీరాములు రెడ్డి(రైతు విభాగం), శివయ్య(బీసీ సెల్), పసల క్రిష్ణయ్య(ఎస్సీ సెల్), గెరటా వెంకటాద్రి(ఎస్టీ సెల్),పఠాన్ ఫరీద్ (మైనార్టీ సెల్), పి.కార్తీక్(విద్యార్థి విభాగం), ఆశా కిరణ్(మున్సిపల్ విభాగం), లక్ష్మీపతి రెడ్డి(న్యాయ విభాగం), జగన్నాథ్ రెడ్డి(వైఎస్సార్ టీయూసీ), పి భరత్ కుమార్ రెడ్డి(ఐటీ విభాగం), ఎం అల్లెయ్య (చేనేత విభాగం), అయోధ్య (గ్రీవెన్స్ సెల్ విభాగం), పి బాలసుబ్రమణ్యం రెడ్డి(పంచాయతీరాజ్ విభాగం), రంగినేని చెంచయ్య నాయుడు (వాలంటీర్ విభాగం), టి మోహన్(దివ్యాంగుల విభాగం), టి రామ్మూర్తి (సాంస్కృతిక విభాగం), టీఎం భాస్కర్(వాణిజ్య విభాగం), బి బాలాజీ(ఆర్టీఐ విభాగం), ఎస్ డేవిడ్(క్రిస్టియన్ విభాగం), ఎం శంకరయ్య(డాక్టర్స్ విభాగం), సి జయకష్ణ(సోషల్ మీడియా విభాగం), జి బత్తి శెట్టి(బూత్ కన్వీనర్ల విభాగం), బి దిలీప్(ప్రచార విభాగం) ఉన్నారు. వీరికి ఆ పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం శక్తి వంచన లేకుండా పనిచేయాలని పిలుపునిచ్చారు.



తహసున్నిసా బేగంకు సేవా రత్న అవార్డు


ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తహ సున్నిసా బేగం ఉయ్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు, ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ విస్డం క్లబ్ ద్వారా ఆమె చేస్తున్న సేవలను గుర్తించి రోటరీ క్లబ్బు వాళ్లు సేవారత్న అవార్డుగా మహిళ దినోత్సవ సందర్భంగా సత్కరించినారు. మహిళ అయి ఉండి కోవిడ్ లో కూడా ఆమె నిరంతరంగా సేవలు చేస్తూనే ఉన్నారని, అలాగే అప్పటినుంచి ఇప్పటివరకు పేద విద్యార్థుల కోసం నిరంతరంగా తన సేవలను అందిస్తూ ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షులు సోము, రవి తదితరులకు ధన్యవాదాలు తెలిపారు.

ట్రాక్టర్లకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

రిజిస్ట్రేషన్ తర్వాతే కొత్తగా కొనుగోలు చేసిన ట్రాక్టర్లు రోడ్లపైకి రావాలని శ్రీకాళహస్తి మోటారు వాహన తనిఖీ అధికారి దామోదర నాయుడు సూచించారు. స్థానిక ఎంవీఐ కార్యాలయంలో శనివారం ఆయన పట్టణ ట్రాక్టర్ డీలర్లతో సమావేశమయ్యారు. డీలర్లు ట్రాక్టర్లను డెలివరీ చేసేటప్పుడు కచ్చితంగా వాహన రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అలాగే వాహన నంబర్ ప్లేట్లు తొందరగా వాహనానికి బిగించే ఏర్పాటు చేయాలని తెలిపారు. శ్రీకాళహస్తి ప్రాంతంలో చాలా ట్రాక్టర్లు నంబర్లు లేకుండా తిరుగుతున్నట్లు గమనించామనీ, ఇకపై అలాంటి తప్పిదాలు దొర్లితే ట్రాక్టర్ యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రాక్టర్లకు సరైన రిజిస్ట్రేషన్ లేకుంటే ప్రమాదం జరిగినా, మరణించినా ఇన్స్యూరెన్స్ వర్తించదని తెలిపారు. ప్రతి ఒక్క ట్రాక్టర్ యజమాని వాహనానికి నంబర్ ప్లేటు అమర్చుకోవాలని తెలిపారు. గత సంవత్సరం జరిగిన ఒక ట్రాక్టర్ ప్రమాదంలో ఒక వ్యక్తి చనిపోయాడని, ఆ ట్రాక్టర్ ను సరి అయిన రిజిస్ట్రేషన్ లేకుండా డెలివరీ చేసినందుకు ఆ డీలరుకు లక్ష రూపాయలు అపరాధం విధించామన్నారు. డీలర్లు అందరూ రవాణా శాఖ వారు సూచించిన నియమ నిబంధనలకు అనుగుణంగా వాహనాలను అమ్మాలని తెలియజేశారు. ట్రాక్టర్ యజమానులు తప్పనిసరిగా అన్ని రికార్డులను, లైసెన్స్ లను కలిగి ఉండాలని సూచించారు.వ్యవసాయానికి వాడే ట్రాక్టర్లను వాణిజ్యపరంగా వాడరాదని తెలియజేశారు. వాణిజ్యపరంగా వాడే ట్రాక్టర్లకు సకాలంలో ట్యాక్స్ లు చెల్లించాలనీ, తనిఖీల్లో పట్టుబడితే 200 శాతం పెనాల్టీ విధిస్తామని హెచ్చరించారు.



'స్టైఫండ్' వివక్షపై 'పోరుబాట'

ప్రజాశక్తి-తిరుపతి సిటి

ప్రజా'దృష్టి'

ప్రభుత్వాలు, పాలకులు ఉన్నది ఎలాంటి ప్రాంతీయ, మత, కుల వర్గ బేదాలు లేకుండా ప్రజలందరికీ సంక్షేమాన్ని అందించి, అభివృద్ధి చేస్తూ, విద్య, వైద్యం సామాన్యులకు సైతం అందుబాటులో ఉంచేందుకు. కానీ నేటి పాలకులు సంక్షేమం, అభివృద్ధి మాట దేవుడెరుగు కనీసం విద్య, వైద్యాన్ని పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచకపోవడం గమనార్హం. అందుకు నిదర్శనమే శ్రీవెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయ విద్యార్థులు 44 రోజులుగా చేస్తున్న ఆందోళనలు.



మూగజీవుల ఆరోగ్యాన్ని కాపాడే పశు వైద్యుల పట్ల, పశు వైద్య విద్యార్థుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష ధోరణిని ప్రదర్శిస్తోంది. 2013 వరకు మెడికల్ విద్యార్థులతో సమానంగా వెటర్నరీ విద్యార్థులకు స్టైఫండ్ అందేది. కానీ ఏమైందో ఏమోకానీ మెడికల్ విద్యార్థుల స్టైఫండ్ క్రమేపీ పెరుగుతూ ప్రస్తుతం 20వేలకు చేరుకుంది. కానీ వెటర్నరీ విద్యార్థులకు మాత్రం నెలకు 7వేల వద్ద నిలకడగా ఉంది. మెడికల్ విద్యార్థుల స్టైఫండ్ పెంచుతూ వెటర్నరీ విద్యార్థులకు పెంచకపోవడం గత టిడిపి పాలన నుంచే అమలు చేయడం గమనార్హం. ఆధునిక పోటీ ప్రపంచంలో పెరిగిన ధరలకు తమకు వచ్చే స్టైఫండ్ కనీసం 20 శాతం కూడా సరిపోవడం లేదు. దీంతో తమకు మెడికల్ విద్యార్థులాగే స్టైఫండ్ పెంచమని గత 13 సంవత్సరాలుగా విశ్వవిద్యాలయం అధికారులకు, ప్రభుత్వానికి 20కి పైగా వినతి పత్రాలు సమర్పించారు. పాలకులు, ప్రభుత్వాలు మారాయే కానీ వీరి స్టైఫైండ్‌లో మాత్రం ఎలాంటి మార్పులేదు. ఆవేదన చెందిన విద్యార్థులు తమ సమస్యను పరిష్కరించాలని కోరుతూ 2022లో 22 రోజుల పాటు సమ్మె చేశారు. ఆ సమయంలో అప్పటి పశుసంవర్ధక శాఖ మంత్రి సిదిరి అప్పలరాజు స్టైఫండ్ పెంచుతామని హామీ ఇచ్చారు. కానీ నేటి వరకు ఎలాంటి చర్యలు లేవు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పశు వైద్య విద్యార్థులు 2024 ఆగస్టులో డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌ను కలిసి తమ సమస్య విన్నవించుకున్నా ఇప్పటి వరకు పరిష్కారం కాలేదు. దీంతో విధిలేని పరిస్థితుల్లో ఇతర వైద్య కోర్సులతో సమానంగా వెటర్నరీ విద్యార్థుల స్టైఫండ్‌ను పెంచాలని, ప్రతి సంవత్సరం 15 శాతం చొప్పున స్టైఫండ్ పెంపుదల చేయాలని, త్రైమాసిక, అర్ధ సంవత్సరానికి బదులుగా విద్యార్థులకు స్టైఫండ్ మొత్తాన్ని క్రమం తప్పకుండా ఇవ్వాలని, ప్రభుత్వం వెంటనే స్పందించి వీలైనంత త్వరగా జీవో జారీ చేయాలని, అవుట్ గోయింగ్ బ్యాచ్(2020)కు స్టైఫండ్ పెంపును వెంటనే వర్తింప జేయాలన్న డిమాండ్లతో నిరవధిక సమ్మె చేయాలని నిర్ణయించారు. ఫిబ్రవరి 1వ తేది నుంచి సమ్మె బాట పట్టారు. పండగ రోజుల్లో సైతం వినూత్నంగా నిరసనలు తెలియజేశారు. తిరుపతికి విచ్చేసిన వివిఐపిలు అందరికీ తమ గోడు వినిపంచే ప్రయత్నం చేశారు. ర్యాలీలు, మానవహారాలు, రక్తదాన శిబిరాలు, క్లినికల్ సేవలు, నల్లరిబ్బన్లతో నిరసనలు, వినూత్న ప్రదర్శనలతో తమ సమ్మెను గత 44 రోజులుగా చేస్తూనే ఉన్నారు. వర్శిటీ అధికారులతో పాటు మరికొంత మంది అధికారులు దీక్ష వద్దకు వచ్చి ఎలాంటి హామీ ఇవ్వకుండానే సమ్మె విరమించాలని చెప్పడంతో విద్యార్థులు ససేమిరా అన్నారు. విద్యార్థి సంఘాలు ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్, ఎన్‌యుఎస్‌ఐ, ఇతరా సంఘాలు, రైతు, ప్రజా, విద్యార్థి సంఘాలు మద్దతు ఇచ్చాయి. అధికారులు హాస్టల్ మూసివేయడంతో విద్యార్థులు ప్రధాన ద్వారాన్ని మూసివేయడంతో అదికారులు దిగి వచ్చి హాస్టల్ తెరిచారు. తమ సమస్య పరిష్కారం కోసం విద్యార్థులు అలిపిరి వద్ద కొబ్బరికాయలు కొట్టారు. చర్చికి, మసీద్‌లకు వెళ్లి ప్రార్ధనలు చేశారు. మోకాళ్లపై కూర్చొని బిక్షాటన చేశారు. పండగలు సైతం నిరసన మధ్య జరుపుకోవడం గమనార్హం. పిడిఎఫ్ ఎంఎల్‌సి లక్ష్మణరావు శాసన మండలిలో పశు వైద్యవిద్యార్థుల సమస్యను లేవనెత్తారు. విద్యార్థుల సమస్యను ప్రభుత్వం పట్టించుకోకపోవడం మరింత ఉధృతంగా చేసేందుకు విద్యార్థులు సిద్ధమయ్యారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వారి సమస్యలను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

ట్రినిటీ హాస్పిటల్స్ వారి నూతన బ్రాంచ్ ప్రారంభం

నాయుడుపేటలో కొత్తగా మరో ఇఎన్‌టి హాస్పిటల్




ప్రజాశక్తి - నాయుడుపేట: నాయుడుపేట, మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ట్రినిటీ హాస్పిటల్ చైర్మన్ ఆదవరం నాగురయ్య ఆధ్వర్యంలో డాక్టర్ నీలిమ ప్రియదర్శిని, డాక్టర్ అనుదీప్‌లు నూతనంగా డాక్టర్ వి.నీలిమ ప్రియదర్శిని ఈ ఎన్ టి జనరల్ హాస్పిటల్‌ను ఏర్పాటు చేశారు. ఈ హాస్పిటల్‌ను కడప రిమ్స్ సి.ఎస్.ఆర్.ఎమ్.ఓ డాక్టర్ ఎం.పెంచలయ్య చేతులమీదుగా శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ పెంచలయ్య మాట్లాడుతూ మహానగరాలకు దీటుగా నాయుడుపేటలో యువ డాక్టర్లు ఇఎన్టి జనరల్ హాస్పిటల్‌ను ప్రారంభించడం సంతోషదాయకం అన్నారు. హాస్పిటల్‌కి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం సేవలు అందించి, వారి మన్ననలు అందుకోవాలని సూచించారు. వీలైనంతవరకు తక్కువ ఫీజులతో నాణ్యమైన వైద్యం అందించాలని, పట్టణ ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు చేయాలని సూచించారు. డాక్టర్ వి.నీలిమ ప్రియదర్శిని, డాక్టర్ ఏ.అనుదీప్‌లు మాట్లాడుతూ డాక్టర్ పెంచలయ్య సూచనలు, సలహాలతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామన్నారు. ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ట్రినిటీ హాస్పిటల్ చైర్మన్ ఆదవరం నాగురయ్య, లక్ష్మీరామ్ ప్రజా వైద్యశాల చైర్మన్ డాక్టర్ రామసుబ్బయ్య, నాయుడుపేట రోటరీ క్లబ్ సభ్యులు నాగలాపురం రామ్మోహన్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు వేలూరు మురళీ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలోప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: మార్చి 15 ప్రపంచ వినియోగదారుల దినోత్సవ సందర్భంగా పుత్తూరు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల కన్స్యూమర్, వాణిజ్య శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సభకు అధ్యక్షత వహించినటువంటి వాణిజ్య శాస్త్ర విభాగ అధ్యక్షురాలు డాక్టర్ ఏ. దేవకి, కన్స్యూమర్ క్లబ్ కన్వీనర్ డాక్టర్ వి.వాసవిలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వినియోగదారుల హక్కుల గురించిన అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి.తిరుమలయ్య, డాక్టర్ జి.గంగయ్య, డాక్టర్ మురళీమోహన్ రెడ్డి, జ్యోతి, లక్ష్మీభాయి, నాగరాజ తదితర అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలను పీడిస్తే చర్యలు తప్పవు



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ఆధ్వర్యంలో గ్రీవెన్స్ డే నిర్వహించారు. పలు గ్రామాల ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యేకి తెలియజేశారు. ఆయన కొన్ని సమస్యలను అక్కడి కక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ అధికారులు సక్రమంగా పనిచేస్తే గ్రీవెన్స్ డేకి ఇంతమంది ఎందుకు వస్తారని, కొన్ని శాఖలు అవినీతిమయమైపోయాయని డబ్బులు ఇస్తేనే పనిచేస్తున్నారని పేదవారిని ఆఫీసుల చుట్టూ తిప్పుకుంటున్నారని వారిపై కలెక్టర్, మంత్రికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. అధికారులు పనిచేయకుండా ప్రభుత్వానికి తప్పుడు నివేదికలు పంపిస్తున్నారని ప్రజల్లో ప్రభుత్వంపై చెడ్డ పేరు వస్తుందని అన్నారు.

కరాటేలో స్వర్ణాంధ్ర భారతి విద్యార్థుల ప్రతిభ



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు రెండవ పట్టణం, మాళవ్యానగర్లోని శ్రీ స్వర్ణాంధ్ర భారతి ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థిని విద్యార్థులు, ఇటీవల నెల్లూరు జిల్లా కేంద్రంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి కరాటే ఛాంపియన్ షిప్ పోటీలలో 35 మంది పాల్గొని, 20 బంగారు పతకాలు,15 కాంస్య పతకాలు సాధించారు. ఈ సందర్భంగా, పాఠశాల ప్రిన్సిపాల్ నవ కోటి నాయుడు ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించారు. కరాటే గురువు ఇబ్రహీం, నాగరాజులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డీన్ సునీల్ రాజు, అకాడమీ కోఆర్డినేటర్ హరిక్రిష్ణ, ప్రైమరీ ఇన్చార్జి సింధు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటి స్థలాలు ఇవ్వాలి



ప్రజాశక్తి - బుచ్చినాయుడుకండ్రిగ మండలంలోని కనమనంబేడు దళితులకు ఇంటి స్థలాలు ఇవ్వాలని నాల్గవ రోజు మోకాళ్లపై నిలబడి సిపిఐ నాయకులు నిరసన తెలియజేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం సీపీఐ ఆధ్వర్యంలో రిలే దీక్షలు ప్రారంభించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనమనంబేడు గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 252, 253, 254552 ప్రభుత్వ భూమిని దళితులకు ఇవ్వాలన్నారు. స్థానికేతరుడైన బత్తెయ్యనాయుడు 1.75 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని, ఫెన్సింగ్ వేశారని ఆరోపించారు. బత్తెయ్యనాయుడు భూ ఆక్రమణను అడ్డుకున్న 10 మంది దళితులపై అక్రమ కేసులు పెట్టడం దారుణమన్నారు. కత్తి ధర్మయ్య మాట్లాడుతూ దళితులపై కేసులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి చిన్నిరాజు, మండల కార్యదర్శి కత్తిధర్మయ్య, దళితులు పాల్గొన్నారు.


అధ్వానంగా వెంకటగిరి - గూడూరు రోడ్డు



ప్రజాశక్తి- వెంకటగిరి టౌన్ : వెంకటగిరి నుండి గూడూరు వెళ్లు రోడ్డు బాలాయపల్లి వరకు గుంటల మయంగా తయారయింది. వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వంగానీ, ఈ ప్రభుత్వ గానీ వెంకటగిరి - బాలాయపల్లి రోడ్డు గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. రోడ్డంతా గుంతల మయం, కంకర రాళ్లు తేలి, దుమ్ముతో నిండిపోయి ఉంది. రోడ్డు ఎప్పుడు వేస్తారో మా కష్టాలు ఎప్పుడు తీరుతాయో అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం రోడ్డు బాగు చేస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని తుంగలో తొక్కారని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.

శిథిలావస్థలో రెవెన్యూ భవనం

- అడుగడుగునా పగుళ్లు
- వర్షం వస్తే అగచాట్లే
- బిక్కు బిక్కుమంటూ విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు




ప్రజాశక్తి - ఓజిలి : కాలం చెల్లిన ప్రభుత్వ భవనాల్లో ఉద్యోగులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని విధులు నిర్వహించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. శిథిలావస్తకు చేరిన భవనాల్లో ఏ క్షణం ఎటునుంచి ప్రమాదం వస్తుందోనని ఉద్యోగులు బిక్కుబిక్కుమంటున్నారు. అర్జీదారులు సైతం కార్యాలయాల్లో రావాలంటే భయపడుతున్నారు. గత రెండేళ్లుగా రోజు రోజుకు శిథిలమవుతున్న ఓజిలి తహసీల్దారు కార్యాలయ భవనంలో పెచ్చులు పైనుంచి పడి ఎప్పుడు ఎవరి మాడు పగులుతుందో తెలియదని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా, కప్పు ఉరుస్తుండడంతో ఫైళ్లు తడిసి పోతున్నాయి. ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో చేసేదేమీ లేక అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని విధులు నిర్వర్తిస్తున్నారు. ఓజిలి మండల కేంద్రంలో 30 సంవత్సరాల క్రితం తహసిల్దారు భవనాన్ని 1994లో నిర్మించారు. భవనం కాల పరిమితి అయిపోయినప్పటికీ నూతన భవనానికి శ్రీకారం చుట్టడం లేదు. కనీసం మరమ్మతులు చేయించే దిక్కులేదు. దీంతో రెవిన్యూ కార్యాలయం భవనంలో పలుచోట్ల పగుళ్లతో పాటు తలుపులు, ద్వారాలు కూడా పూర్తిగా పాడైపోయాయి. కంప్యూటర్, సర్వేయర్ గదులు, హాలులోనూ భారీ బీటలు ఏర్పడి పెచ్చులు ఊడుతున్నాయి. తహసీల్దార్ గదిలోపై స్లాబ్ పెచ్చులు ఊడి పూర్తిగా బీటలు వారింది. గతంలో తహసిల్దారు విధులు నిర్వహించే గది పైకప్పు ఉన్నపళంగా సీలింగ్‌తో పాటు నేలకొరిగింది. అదృష్ట వశాత్తు ఆగదిలో తహసిల్దారు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. అప్పటినుంచి ఈ కార్యాలయంలో విధులు నిర్వహించాలంటేనే సిబ్బంది భయపడుతున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ ఉన్నత అధికారులు స్పందించి, ప్రమాదాల జరగకముందే కొత్త భవనం నిర్మించాలని, లేకుంటే మరమ్మతులు అయినా నిర్వహించాలని ఉద్యోగులు, కార్యాలయానికి వచ్చే అర్జీదారులు మొరపెట్టుకున్నారు.

సమస్యను ఉన్నతాధికారులకు తెలియజేస్తాం



భవనం పరిస్థితి ఇబ్బందికరంగానే ఉంది. సమస్య తీవ్రతను ఉన్నతాధికారులకు సమగ్రంగా వివరించి తగు చర్యలు చేపట్టేందుకు కృషి చేస్తాం.

- ఏ.పద్మావతి, తహసిల్దారు. ఓజిలి

మున్సిపాలిటీ నిధుల దుర్వినియోగం.. వాదోపవాదాలు



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మున్సిపాలిటీలో నిధులు దుర్వినియోగంపై కౌన్సిలర్లకు, చైర్మన్లు మధ్య వాదోపవాదాలు జరిగాయి. శనివారం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ హరి అధ్యక్షతన సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ గతంలో మాజీ మంత్రి రోజా చొరవతో స్మశాన వాటిక అభివృద్ధి, పార్కులు నిర్మాణం, మున్సిపల్ భవనం నిర్మాణం జరిగిందన్నారు. టిడిపి కౌన్సిలర్ గాలి జీవరత్నం నాయుడు మాట్లాడుతూ సమ్మర్ స్టోరేజ్ మరమ్మతుకు 40 లక్షలు జనరల్ నిధుల నుంచి డ్రా చేసింది నిజమా కాదా అని ఒకరికొకరు వాదులు కొన్నారు. అనంతరం కౌన్సిలర్లు వారి వారి వార్డుల సమస్యలపై అధికారులను నిలదీశారు. తాగునీరు, వీధి దీపాల సమస్య, డ్రైనేజీ సమస్యలపై చర్చ జరిగింది. మరాఠీ గెట్ నుంచి నందిమంగళం వెళ్లేందుకు రోడ్డు ఏర్పాటు చేయాలని కౌన్సిలర్లు కోరారు. వివిధ సమస్యలపై స్పందించిన మున్సిపల్ కమిషనర్ తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు డి.జయప్రకాష్, డి.శంకర్, మేనేజర్ మణికంఠ, డిఇ చంద్రశేఖర్, ఏఇలు తదితరులు పాల్గొన్నారు.

అరణియార్ పర్యాటక అభివృద్ధికి నిధులు కేటాయించండి



అరణియార్ ప్రాజెక్ట్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే, కమిషనర్

ప్రజాశక్తి - పిచ్చాటూరు: అరణయార్ పర్యాటక అభివృద్ధి పనులు తుది దశకు చేరుకున్నాయని, అయితే గతంలో కేటాయించిన నిధులు చాలడం లేదని, అధనపు నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తుడా కమిషనర్ రెడ్డిమౌర్యకు విజ్ఞప్తి చేశారు. శనివారం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, తుడా కమిషనర్ మౌర్యలు పిచ్చాటూరు అరణియార్ పర్యాటక అభివృద్ధికి పనులను పరిశీలించారు. ఇరిగేషన్ ఈఈ మదన గోపాల్ ఈ పర్యాటక అభివృద్ధి పనులకు తుడా గతంలో రూ.1.85 కోట్లు మంజూరు చేసిందని, ప్రస్తుతం నిర్మాణ పనులు తుది దశకు చేరుకుందని వారికి తెలిపారు. అయితే జీఎస్టీ పెరుగుదల, రేట్లు పెరుగుదల కారణంగా గతంలో కేటాయించిన నిధులు చాలడం లేదని, అధనంగా రూ.40 లక్షలు నిధులు కేటాయించి పనులు పూర్తికి సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెటింగ్ చైర్మన్ డి.ఇలంగోవన్ రెడ్డి, పద్దు రాజు జయ చంద్ర నాయుడు, ఎంఈఓ హేమమాలిని, రవి, ఢిల్లీ, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉబర్ క్యాబ్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - రామచంద్రపురం (తిరుపతి రూరల్): తిరుపతిలో పనిచేసే ఉబర్ క్యాబ్ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం తిరుచానూరు పంచాయతీ చైతన్యపురం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఉబర్ యాప్‌లకు నగరంలో సుమారు 2 వేల మంది డ్రైవర్లు లింకయ్యారని, ఉబర్ యాజమాన్యం వీరిని గత ఏడు సంవత్సరాలుగా అనేక రకాలుగా ఇబ్బందులు పెడుతోందని వెల్లడించారు. యాజమాన్యం స్థానికంగా లేనందున సమస్యల పరిష్కారానికి ఎవరిని కలవాలో తెలియడం లేదన్నారు. డీజిల్, పెట్రోల్ రేట్లు పెరిగినా తమ కమిషన్ పెంచలేదన్నారు. ఓలా, ఉబర్ పేరుతో తెల్ల బోర్డు వాహానాలు తిరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ సమస్యలతో తమ జీవనం కష్టంగా ఉందని తెలిపారు. అధికారులు చొరవ తీసుకుని తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిబాబు, ఖాదర్ భాషా, రమేష్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి,ఎల్లయ్య, భానుప్రకాష్, దొరబాబు, మురళి, మధుసూదన్‌లు పాల్గొన్నారు.

ప్రజా చైతన్య యాత్రను జయప్రదం చేయండి



రాజగోపాల్, వడ్డిపల్లి చెంగయ్య

ప్రజాశక్తి- బాలయపల్లి: బాలాయపల్లి మండలం, గొట్టికాడు గ్రామంలో శనివారం సిపిఎం పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సిపిఎం పార్టీ వెంకటగిరి నియోజకవర్గ కన్వీనర్ వడ్డిపల్లి చెంగయ్య, బాలాయపల్లి మండల బాధ్యులు రాజగోపాల్‌లు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా బాలాయపల్లి మండలంలో ఈనెల 17, 18 తేదీలలో ప్రజా చైతన్య యాత్రలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. సభ్యులు, సానుభూతిపరులు ప్రజా చైతన్య యాత్రలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ఎం.వి.రమణ, సభ్యులు సంపూర్ణమ్మ తదితరులు పాలొన్నారు.


వాటా కోసం.. డిష్యుం డిష్యుం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: దళారుల వాటా పంపకాల్లో తేడా రావడంతో కొట్టుకుని వీధికెక్కిన ఘటన శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శ్రీకాళహస్తీశ్వరాలయ అన్నదాన సత్రంలో పనిచేసే ఒక తాత్కాలిక ఉద్యోగి రెండు రోజుల క్రితం ఆలయంలోకి కొందరు భక్తులను దర్శనానికి తీసుకెళ్లాడు. ప్రవేశం టికెట్టు లేకుండా తీసుకెళ్లి దర్శనం చేయించాడు. (ప్రవేశం టికెట్ లేకుండా దర్శనానికి తీసుకెళితే కొందరికి వాటా ఇవ్వాలి) అయితే ప్రవేశ టికెట్టు లేకుండా దర్శనం చేయించినందుకు తమకు రావాల్సిన వాటా గురించి కొందరు హోంగార్డులు, సిబ్బంది ఆ ఉద్యోగిని నిలదీశారు. అతను వారికి వాటాలు ఇవ్వలేదు. దీంతో వాటాల చెల్లింపులు విషయం రోడ్డుపైకి వచ్చింది. పట్టణంలోని బీపీ అగ్రహారం వద్ద రాత్రిపూట రోడ్డుపై ఉండిన ఆ ఉద్యోగిపై ముగ్గురు హోం గార్డులు, ఒక దేవస్థానం ఉద్యోగి చిత్తుగా తాగి దాడి చేశారు. దాంతో సదరు ఉద్యోగి ఈ ఈవోకు ఫిర్యాదు చేశాడు. కాగా వాటా కోసం ఆలయ ఉద్యోగులు బహిరంగంగానే కొట్టుకోవడం చూసి అక్కడున్నవారు ముక్కున వేలేసుకున్నారు.

నేడు, రేపు ఏపీపీఎస్సీ ఫారెస్ట్ సర్వీస్ పరీక్షలు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: ఈ రోజు, రేపు జిల్లాలో జరగనున్న ఏపీపీఎస్సీ - ఏపీ ఫారెస్ట్ సర్వీస్ (స్క్రీనింగ్ టెస్ట్), ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ల పోస్టులకు వ్రాత పరీక్షలు (కంప్యూటర్ ఆధారిత పరీక్షలు) మరియు జూనియర్ అసిస్టెంట్ పోస్టులకు సంబంధించిన పరీక్షలకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేయడం జరిగిందని ఇన్చార్జి డిఆర్ఓ దేవేందర్ రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్లోని పరిపాలన అధికారి ఛాంబర్‌లో సంబంధిత అధికారులతో పరీక్షల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. పరీక్షా కేంద్రముల వివరాలు: 9105 ఐయాన్ డిజిటల్ జోన్ ఐ డి జెడ్ జూ పార్క్ రోడ్, చెర్లోపల్లి గ్రామం, తిరుపతి రూరల్ మండలం, తిరుపతి, 1004 శ్రీ వెంకటేష పెరుమాళ్ కాలేజీ అఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, ఆర్‌విఎస్ నగర్, కార్వేటి నగరం రోడ్, చిన్నరాజ కుప్పం, పుత్తూరు మండలం, తిరుపతి, 1560 ఎన్.బి.కె.ఆర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, విద్యానగర్, కోట మండలం, తిరుపతి. ఈ సమావేశంలో ఏపీపీఎస్సీ నుండి సి హెచ్. సాయి ప్రకాశ్, అసిస్టెంట్ సెక్రటరీ (మానిటర్), సి హెచ్ యోగేశ్వర రావు, సెక్షన్ ఆఫీసర్, అధికారులు, పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : తొట్టంబేడు మండలం, బోనుపల్లిలో శనివారం అధికారులు పారిశుధ్య పనులు చేపట్టారు. శుక్రవారం సీపీఎం నేతలు గ్రామంలో పర్యటించి పారిశుధ్యం అధ్వానంగా ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలకుల, అధికారుల తీరును ఈ సందర్భంగా మీడియా ద్వారా ఎండగట్టారు. స్పందించిన అధికారులు పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు చేపట్టారు.

'19 న చలో విజయవాడ' జయప్రదం చేయండి

ప్రజాశక్తి - తిరుపతి : ఆప్కాస్ రద్దుకు వ్యతిరేకంగా మార్చి 19న చలో విజయవాడ జయప్రదం చేయాలని కోరుతూ వ్యవసాయ కళాశాల ఆవరణలో కరపత్రాల ఆవిష్కరణ చేశారు. ఆప్కాస్ రాష్ట్ర అధ్యక్షుడు చిన్న బాబు, సిఐటియు జిల్లా కార్యదర్శి జయచంద్ర, కాంట్రాక్ట్, అవుట్సోర్సింగ్ ఎంప్లాయిస్ తిరుపతి జిల్లా జేఏసీ చైర్మన్ గండికోట నాగవెంకటేష్‌లు చలో విజయవాడ కార్యక్రమానికి అవుట్సోర్సింగ్ ఉద్యోగులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

ఘనంగా స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛ దివస్ : ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన



ప్రజాశక్తి -ఏర్పేడు : ఏర్పేడు మండలం, యండి పుత్తూరులో సర్పంచ్ మోహనప్రియ ఆధ్వర్యంలో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరిసరాల శుభ్రతకు పాటుపడతామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి చంద్రకళ, సచివాలయ సిబ్బంది, తెదేపా నాయకులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పురపాలక సంఘం ఆధ్వర్యంలో గూడూరులోని స్థానిక టవర్ క్లాక్ సెంటర్‌లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై స్వర్ణాద్ర-స్వచ్ఛాంధ్ర అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా గూడూరు ఎమ్మెల్యే పాశి సునీల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే ప్లాస్టిక్ అమ్మకాలు చేయవద్దని వ్యాపారులకు సూచించారు. ఈనెల 20వ తేదీ వరకు వ్యాపారులకు అవకాశం ఇస్తున్నామని, ఆ తర్వాత ప్లాస్టిక్ అమ్మకాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, డిఎస్పి గీతా కుమారి, టీడీపీ నాయకులు శీలం కిరణ్ కుమార్, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, రహీం, వాటంబేడు శివకుమార్, మయూరి శ్యాం యాదవ్, వివిధ శాఖల అదికారులు, పాఠశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా తిరుపతి జిల్లా బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో, మండల శాఖ అధికారులు శనివారం ర్యాలీ నిర్వహించారు. పోలీసులు పరిశుభ్రతా కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రతినెల మూడవ శనివారం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం మండల ప్రెసిడెంట్ సుధాకర్ నాయుడు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ నల్లయ్య, ఎంపీడీవో త్రివిక్రమ రావు, విద్యాశాఖ అధికారులు రవీంద్రనాథ్, స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ విశ్వనాథ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి- వెంకటగిరి టౌన్: డక్కిలి మండల కేంద్రంలో, వెలుగు ఆఫీస్ వద్ద ఏపిఎం జమున ఎమ్మెస్ అధ్యక్షురాలు గురవమ్మ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఆంధ్రప్రదేశ్‌ను స్వచ్ఛ్ ఆంధ్ర ప్రదేశ్‌గా తీర్చిదిద్దడంలో నా వంతు కృషి చేస్తామని ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో సీసీలు వెంకటేష్, సురేష్, రాజేశ్వరి, శ్రీనివాస్, అకౌంటెంట్ పెంచలమ్మ, వివోఏలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - ఓజిలి : ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం ఎంపీపీ గడ్డం అరుణారెడ్డి, డిఎల్పిఓ రవీంద్రబాబు, ఎంపీడీవో విజయలక్ష్మిల ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ గడ్డం అరుణారెడ్డి మాట్లాడుతూ నిత్యవసరాలలో భాగంగా ఎన్నో రకాలుగా ప్లాస్టిక్ కవర్లు వాడుతున్నామని వాటి స్థానంలో క్లాత్ బ్యాగులను వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శైలజ, ఏపీవో ఉషారాణి, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ సురేష్, రెవిన్యూ శాఖ, ఎన్ఆర్ఈజీఎస్, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, డ్వాక్రా సంఘాల మహిళలు, పారిశుధ్య కార్మికులు ర్యాలీ నిర్వహించారు.

ప్రజాశక్తి - రామచంద్రపురం : స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని రామచంద్రపురం మండల రెవెన్యూ తహసిల్దార్ వెంకటరమణ పిలుపునిచ్చారు. అవగాహన ర్యాలీని తాహాసిల్దార్ కార్యాలయం నుండి రామచంద్రాపురం ప్రధాన కూడలి వరకు రెవెన్యూ, పంచాయతీ రాజ్, పోలీస్, విద్యాశాఖల ఆధ్వర్యంలో విద్యార్థులచే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఇందిరమ్మ, మండల పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ రామాంజనేయులు డిప్యూటీ తాసిల్దార్ అన్వర్ భాష, సర్వేయర్ ఎస్ రమేష్ బాబు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, చంద్రశేఖర్ రెడ్డి, రజని, అల్లప్ప, వీఆర్వోలు గుణ భూషణ్ నాయుడు, రాజశేఖర్, నరసింహులు, వెంకటరమణ , రెవెన్యూ, పోలీస్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి - సత్యవేడు : స్వచ్ఛత పట్ల ప్రజల్లో మార్పు తీసుకురావాల్సిన అవసరం ఉందని స్థానిక ఎంపీపీ ప్రతిమ సుశీల్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల పరిషత్, వెలుగు ఆధ్వర్యంలో స్వచ్ఛ్ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ప్రతిమ మాట్లాడుతూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి గృహిణిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కోఆప్షన్ సభ్యులు మస్తానమ్మ, ఎంపీటీసీలు బాలయ్య, సరవన,సెల్వి, ఇంద్రాణి, సర్పంచులు రవి రెడ్డి, మధురాజు, గోవింద్ స్వామి, శేఖర్, శివరంజని, ఇరిగేషన్ ఏఈ ప్రభాకర్ రెడ్డి, ఈవో అండ్ఆర్డి తరుణాక్ష రెడ్డి, వెలుగు ఏపీఎం డాక్టర్ డాంగే యాదవ్, సిసి శివకుమార్, పుల్లయ్య, ఉపాధి ఏపీవో కృష్ణయ్య, ఎంపిహెచ్ఈఓ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెళ్లకూరు: పెళ్లకూరుమండలంలో 24 గ్రామపంచాయతీలలో శనివారం స్వచ్ఛ-స్వచ్ఛ దివస్ కార్యక్రమం స్థానిక సర్పంచ్‌ల ఆధ్వర్యంలో గ్రామ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది కలిసి ర్యాలీ నిర్వహించి, ప్లాస్టిక్ వాడకం నిషేధించండి, పరిసరాల పరిశుభ్రతను పాటించండి నినాదాలతో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఆర్డబ్ల్యూసీఐ, సచివాలయ సిబ్బంది, రాజకీయ నాయకులు పాల్గొని విజయవంతంగా నిర్వహించారు.

ధాన్యానికి గిట్టుబాటు ధర దక్కేలా చర్యలు తీసుకోవాలి



ప్రజాశక్తి -వెంకటగిరి: మిల్లర్లు, దళారులతో ప్రభుత్వం కుమ్మక్కై ఎగుమతికి అనుమతులు ఇవ్వకుండా ధాన్యం ధరలు తగ్గించిందని రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వి.వి.రమణయ్య విమర్శించారు. శనివారం స్థానిక కాళహస్తి శేషయ్య స్మారక భవనంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ వరి కోతలు వెంకటగిరి పరిసర ప్రాంతల్లో జోరందుకున్నాయని, ధాన్యం ధరలు మాత్రం బాగా పడిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండు సంవత్సరాలుగా 75 కిలోల బస్తా రూ.2300 వరకు అమ్మగా ఈసారి బీపీటీలు 1600 ఆర్ఎన్ఆర్లు 1750 రూపాయలకు తగ్గించి వేశారన్నారు. రైతు చేతిలో ధాన్యం ఉన్నప్పుడు ఎగుమతులకు పర్మిషన్ ఇవ్వకపోవడంతో ధాన్యం ధరలు పడిపోయాయన్నారు. మిల్లర్లు తక్కువ ధరకు కొనుగోలు చేసి తమ మిల్లుల్లో నిల్వ చేసుకుని ప్రభుత్వం వద్ద ఎగుమతులకు అనుమతి పొంది మంచి ధర పొందుతారన్నారు. మిల్లర్లకు మేలు చేయడానికే ప్రభుత్వం రైతుకు ధర ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తుందని దుయ్యబట్టారు. ఇటీవల మద్దతు ధరకు కొనుగోలు కేంద్రాల ద్వారా కొంటామని జిల్లా కలెక్టర్ ప్రకటన చేసినప్పటికీ రైతుకు గిట్టుబాటు ధర దక్కలేదన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రూ.1740 మాత్రమే మద్దతు ధరగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. వరి కోతలు మొదలైనా ఇప్పటివరకు కొనుగోలు కేంద్రాలు తెరవకపోవడం ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి నిదర్శనమన్నారు. కౌలుకి సాగు చేస్తున్న రైతులకు గడ్డి తప్ప ఏమీ మిగలదన్నారు. రైతుకి గిట్టుబాటు ధర దక్కాలంటే బస్తాని రూ.2500 కి ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతు కూలీ సంఘం డిమాండ్ చేస్తోందన్నారు. ప్రభుత్వం తేమ శాతం 17 ఉండాలన్న నిబంధన సడలించినప్పటికీ దళారులు తరుగు కింద 5 కిలోలు అదనంగా రైతుల వద్ద తీసుకుంటున్నారని, దళారులను కట్టడి చేయాలని డిమాండ్ చేశారు. ధాన్యం ధరలు తగ్గిపోవడంతో ఎకరాకి రైతుకు రూ. 20000 నష్టం వస్తోందని తెలిపారు. తక్షణమే ధాన్యానికి గిట్టుబాటు ధర దక్కేలా చర్యలు తీసుకోవాలని రైతు కూలీ సంఘం డిమాండ్ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా కమిటీ సభ్యులు జి కృష్ణారెడ్డి, జి తిరుపాలు, రైతు నాయకులు నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

మిద్దెపై నుంచి పడి కార్మికుడు మృతి



మృతి చెందిన దావీదు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ప్రమాదవశాత్తు మిద్దె పైనుంచి పడి కార్మికుడు మృతి చెందిన ఘటన శనివారం ఆటోనగర్‌లో జరిగింది. గుంటూరు చెందిన అబ్రహం కుమారుడు దావీదు (56) స్థానికంగా పెయింటింగ్ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. శుక్రవారం ఆటోనగర్‌లో ఓ భవనానికి రంగులు వేసేందుకు తోటి కార్మికులతో కలిసి వెళ్ళాడు. రంగులు వేస్తూ సాయంత్రం మూడో అంతస్తు నుండి కాలుజారి కింద పడ్డాడు. తీవ్ర గాయాలైన దావీదును తోటి కార్మికులు రుయా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, బంధువులకు అప్పగించారు. అలిపిరి పోలీసుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడు ఆత్మహత్య



మృతి చెందిన మహేష్

ప్రజాశక్తి-రామచంద్రపురం (చంద్రగిరి): చంద్రగిరి, పాతపేట, ముకుంద వీధికి చెందిన నారిశెట్టి మహేష్ (28) శనివారం ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మహేష్ తిరుమల కొండమీద ఓ దుకాణం పెట్టుకుని వ్యాపారం నిర్వహిస్తూ ఇంటికి అప్పుడప్పుడు వచ్చేవాడు. ఈ నెల మూడో తేదీన మహేష్ తిరుమలకి వెళ్ళాడు. మహేష్ భార్య బండి కవిత వేలూరులో ఉంటున్న తన పిన్ని ఇంటికి జాతరకు భర్తకు చెప్పి వెళ్లింది. శనివారం పలుమార్లు తన భర్తకు ఫోన్ చేసినా ఎత్తకపోవడంతో అనుమానం వచ్చి, ఆ వీధిలోని యువకుడికి ఫోన్ చేసి నా భర్త ఏమి చేస్తున్నాడో చూడాలని కోరింది. ఆ యువకుడు వారు కాపురం ఉంటున్న ఇంటికి వెళ్లి చూడగా మహేష్ ఇంటిలోని ఫ్యాన్‌కు ఉరివేసుకొని కనిపించాడు. స్థానికులు మహేష్‌ను కిందికి దించి, చంద్రగిరి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్ళగా అప్పటికే మహేష్ మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మృతుడికి ఓ కుమారుడు ఉన్నాడు. కవిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీ చైతన్య టెక్నో పాఠశాలలో దారుణం

తోటి విద్యార్థిని మిద్దెపై నుంచి తోసేసిన బాలిక

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : తిరుపతి టెక్నో స్కూల్లో దారుణం చోటు చేసుకుంది. ఇద్దరు విద్యార్థునుల మధ్య రగడ, ఓ బాలికను ప్రాణాపాస్థితిలోకి వెళ్లేలా చేసింది. ఇద్దరు విద్యార్థునుల మధ్య శనివారం సాయంత్రం గొడవ చోటుచేసుకుంది. ఈ గొడవలో తోటి విద్యార్థినిని రెండవ అంతస్తు నుండి క్రిందకు తోసేసింది. 14 సంవత్సరాల బాలికకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన విద్యార్థిని పాడిపేటకు చెందిన 9వ తరగతి విద్యార్థి స్నేహగా గుర్తించారు. స్పందించిన స్కూల్స్ సిబ్బంది, గాయపడిన బాలికను ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి గోప్యంగా చికిత్స చేయిస్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆసుపత్రికి చేరుకొని, ప్రమాద ఘటనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు ఈస్ట్ పోలీసులు విచారణ చేపడుతున్నారు.

ఇంటర్ పరీక్షలకు 28,111 మంది హాజరు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : జిల్లాలో శనివారం జరిగిన ఇంటర్మీడియట్ రెండవ సంవత్సర పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 28,111 మంది విద్యార్థులు హాజరయ్యారని ఆర్.ఐ. ఓ జీ.వి.ప్రభాకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి జిల్లా వ్యాప్తంగా 86 జనరల్, 12 ఒకేషనల్ కేంద్రాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కెమిస్ట్రీ పేపర్ 2, కామర్స్ పేపర్ 2, సోషియాలజీ పేపర్ 2, ఫైన్ ఆర్ట్స్ , మ్యూజిక్ పేపర్ 2, ఒకేషనల్ పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షకు జనరల్ 27,869 మంది, ఒకేషనల్లో 818 మంది మొత్తం 28,687 మంది విద్యార్థులు హాజరవ్వాల్సి ఉండగా జనరల్లో 518 , ఒకేషనల్లో 58 మంది, మొత్తం 576 మంది పరీక్షకు గైర్హాజరయ్యారని తెలిపారు.

ప్రశాంతంగా ముగిసిన ఇంటర్ పరీక్షలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరులో ఈనెల 1 నుంచి ప్రారంభమైన ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా శనివారంతో ముగిశాయి.

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

ప్రజాశక్తి - రామ చంద్రపురం: తిరుపతి జిల్లా పర్యటనకు విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి, తిరుపతి జిల్లా ప్రత్యేక అధికారి కోన శశిధర్‌ను జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శనివారం చంద్రగిరి ఎమ్మెల్యే నాని మర్యాదపూర్వకంగా కలిశారు. చంద్రగిరి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని శశిదర్‌ను నాని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మౌర్య పలువురు నాయకులు పాల్గొన్నారు.

బకాయిల వసూలుకు చర్యలు ఏవీ..?

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : గుత్తేదారులు మున్సిపాలిటీ పరిధి లో దినసరి మార్కెట్ వివిధ రకాల టెండర్లు పాడుకొని, గేట్ వసూలు చేసుకుని మున్సిపాలిటీకి చెల్లించాల్సి బకాయిలపై దృష్టి పెట్టాలని మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడకు సిపిఐ పార్టీ పుత్తూరు పట్టణ కార్యదర్శి డి.మహేష్, నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ మున్సిపల్ మార్కెట్, జంతు వధశాల, ప్రైవేటు బస్టాండ్ వంటి వాటిని పాడుకున్న గుత్తేదారులు మున్సిపాలిటీకి 40 లక్షల పదివేల రూపాయలు బకాయిలు ఉన్నారని తెలిపారు. వాటిని వసూలుచేసి మున్సిపాలిటీ అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ నాయకులు రవి, మణి, రమణ, మహేష్, బి.ఎస్.పి పార్టీ నాయకులు ధనుంజయ, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలిక అప్పగింత



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, ఇందిరమ్మ కాలనీ వద్ద ఓ బాలిక ఏడుస్తూ ఉండడంతో గమనించిన స్థానికులు గూడూరు రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్‌కి సమాచారం ఇచ్చారు. ఆయన వివరాలు ఆరా తీయగా తన పేరు గాయత్రి అని, 6క్లాస్ మున్సిపల్ హైస్కూల్లో చదువుతున్నానని చెప్పింది, మిగతా వివరాలు చెప్పలేదు. ఆయన స్థానికుల సహకారంతో మరిన్ని వివరాలు సేకరించి, దిగువ వీరారెడ్డిపల్లి హరిజనవాడలో ఉన్న బాలిక బాబాయి వద్దకు చేర్చారు.

విద్యా సామగ్రి వితరణ

ప్రజాశక్తి - పుత్తూరు వడమాలపేట మండలం, బాలుర, బాలికల పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు బహుజన సేవా సంఘం ఆధ్వర్యంలో పరీక్ష సామాగ్రి అందించారు. ఈ కార్యక్రమంలో బహుజన సేవా సంఘం అధ్యక్షుడు తాళ్లపాక దిలీప్ కుమార్, మునెయ్య, యుగంధర్, భాను, సాయి, నరేంద్ర, హృతిక్ సుబ్రహ్మణ్యం,అధ్యాపకులు పాల్గొన్నారు.

శరీరం చెప్పినట్టు వినాలి : ప్రకృతి వ్యవసాయ నిపుణులు ప్రకృతివనం ప్రసాద్



ప్రజాశక్తి - క్యాంపస్ : రసాయన ఎరువులు, పురుగు మందులు వాడకుండా సహజసిద్ధంగా పండే ఆహారం ఎంతో శ్రేష్ఠమైందని, ఎలాంటి ఆహారం తీసుకోవాలనే విషయంలో శరీరం చెప్పినట్టు వినాలని ప్రముఖ ప్రకృతి వ్యవసాయ నిపుణులు ప్రకృతి వనం ప్రసాద్ తెలిపారు. పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా తిరుపతి చాప్టర్, జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ సావేరి హాల్లో సంపూర్ణ ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమం అనంతరం శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ విసి ఆచార్య ఉమకు జ్ఞాపిక ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా విచ్చేసిన ప్రసాద్ మాట్లాడుతూ ఉపవాసం ప్రాధాన్యతను వివరించారు. చక్కటి శారీరక శక్తికి తృణధాన్యాలతోపాటు రాగులు, సజ్జలు విరివిగా వాడాలని సూచించారు. సాయంకాలం వేళల్లో త్వరగా భోజనం చేయాలని, గూట్లో దీపం నోట్లో ముద్ద అన్న నానుడిని పాటించాలని కోరారు. వర్షపు నీటిని సేకరించి నిల్వ చేసుకుని శుద్ధి చేసుకుంటే మంచి మినరల్ వాటర్ దొరుకుతుందన్నారు. ప్రఖ్యాత శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్స్ చెప్పినట్టు మరో వెయ్యేళ్లలో భూమి మొత్తం నిస్సారం అవుతుందని, ఈ పరిస్థితి రాకుండా ఇప్పటి నుండే దిద్దుబాటు చర్యలు చేపట్టాలని కోరారు. ప్రతి ఒక్కరూ తెల్లవారుజామునే నిద్ర లేచి చెమట పట్టేలా వ్యాయామం చేయాలన్నారు. తీసుకునే ఆహారం పట్ల శ్రద్ధ వహించి ఆకు కూరలు, పండ్లు తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ఆధునిక ఆహార అలవాట్లను పునఃపరిశీలించుకోవాలని సూచించారు. జెసిఐ జోన్ ఛైర్మన్ గోపి కిషోర్ మాట్లాడుతూ మానవుల శారీరక, మానసిక ఆరోగ్యం కోసం భూమిని రసాయనాల బారి నుండి రక్షించాలన్నారు. జెసిఐ ఆధ్వర్యంలో 20 ఏళ్ల నుండి 40 ఏళ్ల లోపు యువతీ యువకులకు మానసిక వికాసానికి సంబంధించిన శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పీఆర్వో రజనీ, పిఆర్ఎస్ఐ తిరుపతి చాప్టర్ ఛైర్మన్ శ్రీనివాసరావు, సెక్రటరీ దుద్యాల చంద్రమోహన్, కోశాధికారి ఆచార్య చక్రవర్తి రాఘవన్, జెసిఐ జోన్ వైస్ ఛైర్మన్ జి.శంకర్, సెక్రటరీ సోమయ్య, పిఆర్ఎస్ఐ పూర్వ ఛైర్మన్లు డా. స్వరాజ్యలక్ష్మి, ఆచార్య త్రిపురసుందరి, నగరవాసులు పాల్గొన్నారు.

వినియోగదారులు హక్కులను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - క్యాంపస్ :వినియోదారులు సమాజంలో తమ హక్కులను సద్వినియోగం చేసుకోవాలని వినియోగదారుల సంఘం అధ్యక్షులు పి.రాజారెడ్డి పేర్కొన్నారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, బిజినెస్ మేనేజ్మెంట్ సమావేశ మందిరంలో జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం డిపార్ట్మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్మెంట్, నెహ్రూ యువ కేంద్రం, చిత్తూరు సంయుక్తంగా "ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం " సందర్భంగా "సుస్థిరమైన జీవనశైలికి న్యాయమైన మైన పరివర్తన" అనే అంశంపై శనివారంఅవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తూనికలు,కొలతల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ స్వామి, ఫుడ్ ఇన్స్పెక్టర్ మద్దిలేటి తదితరుల పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే ఆదిమూలం పరామర్శ



పిచ్చాటూరు- ప్రజాశక్తి: కేవీబీ పురం మండలం, వగత్తూరు గ్రామంలో టిడిపి మండల పార్టీ మాజీ అధ్యక్షులు బాలకృష్ణారెడ్డి సతీమణి జయలక్ష్మి శుక్రవారం మరణించారు. పిచ్చాటూరు టీచర్స్ కాలనీకి చెందిన ఈశ్వర్ అనే యువకుడు హఠాన్మరణం చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం శనివారం ఉదయం వగత్తూరుకు చేరుకొని జయలక్ష్మి భౌతిక కాయానికి నివాళి అర్పించారు. అనంతరం పిచ్చాటూరు టీచర్స్ కాలనీ లోని ఈశ్వర్ స్వగృహానికి చేరుకొని మృతుని భౌతిక కాయానికి పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఇలంగోవన్ రెడ్డి, అరణియార్ ఆయకట్ట ఛైర్మన్ రవి రెడ్డి, కేవీబీపురం మండలానికి చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థుల పరీక్ష ఫీజులు కట్టించుకోండి

ప్రజాశక్తి - క్యాంపస్ : విద్యార్థుల పరీక్ష ఫీజులు కట్టించుకోవాలని ఎఐఎస్ఎ, పిడిఎస్యు నేతలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శనివారం వారు మాట్లాడుతూ టర్మ్ ఫీజులు కడితేనే సెమిస్టర్ ఫీజులు కట్టించుకుంటాం.. అనే ధోరణి విడనాడాలని అన్నారు. ప్రభుత్వాలు విద్యార్థులకు ఫీజు రీయంబర్స్మెంట్, స్కాలర్షిప్లు ఇవ్వకపోతే విద్యార్థులు చేసిన నేరం ఏంటన్నారు. టర్మ్ ఫీజులతో సంబంధం లేకుండా సెమిస్టర్ ఫీజులు చెల్లించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిన్న వంశీకృష్ణ, వంశీ, ఈశా, భవిత, శివ పాల్గొన్నారు.

నలుగురు వైసీపీ నాయకులకు పదవులు

ప్రజాశక్తి -ఏర్పేడు : శ్రీకాళహస్తి నియోజకవర్గం, ఏర్పేడు మండలంలో వైసీపీకి చెందిన నలుగురికి నియోజకవర్గస్థాయి పదవులు దక్కాయి. నియోజకవర్గంలో బీసీల సంఖ్య అధికంగా ఉండడంతో బీసీల అభ్యున్నతి కోసం మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, ఏర్పేడు మండలం సర్పంచుల సంఘం అధ్యక్షుడు నల్లపాలెం శివయ్యను నియోజకవర్గ బీసీల అధ్యక్షుడిగా ఎంపిక చేశారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఆదేశాలు విడుదలయ్యాయి. ఈ సందర్భంగా పలువురు బిసి నాయకులు నల్ల పాలెం శివయ్యను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శివయ్య మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి తనకు ఈ పదవి రావడానికి సహకరించిన మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డికి ఇతర పార్టీ నాయకులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు. బూత్ కమిటీ అధ్యక్షులుగా సీనియర్ వైఎస్ఆర్సిపి నాయకులు బండారుపల్లికి చెందిన జి.భత్తి శెట్టికి, బూత్ కమిటీ అధ్యక్షుడిగా అరుదైన గౌరవం దక్కింది. గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులుగా సరస్వతీ కండ్రికకు చెందిన సీనియర్ నాయకులు అరకొండ్రం అయోధ్యను వరించింది. సాంస్కృతిక విభాగం అధ్యక్షులుగా వికృతమాలకు చెందిన సీనియర్ దళిత నాయకుడు టీ.రామ్మూర్తికి గుర్తింపు లభించింది. నియోజకవర్గస్థాయిలో నలుగురికి కీలకమైన పదవులు ఏర్పేడు మండలంలో నాయకులకు లభించాయి.

ఎస్ డబ్ల్యూ పి ఎస్ షెడ్ లోకి వానపాముల విడుదల

ప్రజాశక్తి -కోట : కోట మండలం, తిమ్మనాయుడు పాలెం పంచాయతీలో ఎస్ డబ్ల్యూ పి ఎస్ షెడ్లోకి అధికారులు వానపాములును వదిలారు. ఈ సందర్భంగా శనివారం డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ డి పి ఆర్సీ శిరీష, వి ఓ పి ఆర్డీ వై.వేణు ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. ఘన వ్యర్థాలు నుండి ఏ విధంగా సంపద సృష్టించాలో వివరించారు. ఎలాంటి రసాయనాలు కలపకుండా ఆర్గానిక్ పంటలు పండించే విధంగా సహజ ఎరువులను ఏ విధంగా ఈ ఘన వ్యర్థాలను నుండి తయారు చేయాలో పలు సూచనలు, సలహాలును అందించారు. ప్రతిఒక్కరూ ఎస్ డబ్ల్యూ పి ఎస్ షెడ్లను అందుబాటులోకి తీసుకుని రావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వి ఓ పి ఆర్డీ యోకొల్లు. వేణు,పంచాయతీ కార్యదర్శులు నెలవల. రాజశేఖర్, రియాజుద్దీన్, తిమ్మనాయుడు పాలెం పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్, ఐ.సుజనప్రియ, సచివాలయం, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

బీసీలను పార్టీకి చేరువ చేయడమే లక్ష్యం

చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని కలిసిన బీసీ నేతలు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : చంద్రగిరి నియోజకవర్గంలో బీసీలను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చేరువ చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని, జగనన్న ప్రభుత్వం చేసిన సాయం, చెవిరెడ్డి చేసిన మేలును అందరికీ తెలిసేలా చేస్తామని బీసీ విభాగం నేతలు వెల్లడించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి అనుబంధమైన బీసీ సెల్ చంద్రగిరి నియోజకవర్గం అధ్యక్షులుగా నియమితులైన చెంచుమోహన్ యాదవ్ శనివారం చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని తుమ్మలగుంటలోని ఆయన ఇంటి వద్ద కలసి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు చిన్నియాదవ్తో పాటు బీసీ సామాజిక వర్గానికి చెందిన వారంతా చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని కలవడంతో ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించారు. అనంతరం చెవిరెడ్డి మోహిత్ రెడ్డి మాట్లాడుతూ జగనన్న నాయకత్వంలో మనమంతా పని చేయడం అదృష్టంగా భావించాలని అన్నారు. పార్టీ పదవులు స్వీకరించిన వారంతా శక్తి వంచన లేకుండా గ్రామాల్లో పార్టీ పటిష్టతకు పనిచేయాలన్నారు. అనంతరం చంద్రగిరి నియోజక వర్గంలో పార్టీకి పూర్వ వైభవం తీసుకువచ్చేలా కష్టపడుతామని, బీసీలను పార్టీకి చేరువ చేయడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. అంతకు ముందు చెంచు మోహన్ యాదవ్కు శాలువా కప్పిన చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అభినందనలు తెలిపారు. అనంతరం చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డిని కూడా కలసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్యనాయకులు, బీసీ విభాగం నేతలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి బీద రవిచంద్రని కలిసిన కోట టీడీపీ నాయకులు



ప్రజాశక్తి -కోట : ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎన్నికైన బీద రవిచంద్రను ఆయన నివాసంలో కోట మండలానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలు, శాలువాలు కప్పి అభినందనలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్సీ బీద రవిచంద్ర కోట టీడీపీ నాయకులుతో ప్రస్తుత రాజకీయాలను గూర్చి అడిగి తెలుసుకున్నారు. కలిసిన వారిలో గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్, తిరుపతి జిల్లా మైనారిటీ అధ్యక్షులు షేక్ జలీల్ అహ్మద్, టీడీపీ సీనియర్ నాయకులు నెల్లూరు.మోహన్ రెడ్డీ,వెంకన్నపాలెం సర్పంచ్ కోకర్ల.మధు యాదవ్,కోట ఎంపిటిసి లు దారా.సురేష్,షేక్.షంషుద్దీన్,షేక్ మస్తాన్ బాష,నౌషద్ బాష,మస్తాన్ బాష,తదితరులు ఉన్నారు.

చంద్రగిరిని అభివృద్ధి పథంలో నడిపిద్దాం



ప్రజాశక్తి - రామచంద్రపురం (పాకాల) చంద్రగిరి నియోజకవర్గం అభివృద్ధిలో పరుగులు పెట్టిద్దామని ఎమ్మెల్యే పులివర్తి నాని, చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావులు అన్నారు. శనివారం దామల చెరువు పంచాయతీలో రూ.4 కోట్ల రూపాయల యన్.అర్.జి.యస్ నిధులతో నూతనంగా నిర్మించిన సిసి రోడ్లను వారు ప్రారంభించారు. మామిడి రైతులను దృష్టిలో ఉంచుకొని, మ్యాంగో బోర్డుని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు సహకారంతో ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామ్మోహన్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మురళి, జడ్పిటిసి నంగా పద్మజా రెడ్డి, మండల స్థాయి అధికారులు, కూటమి పార్టీల నాయకులు, పాల్గొన్నారు.

అవిలాలను అభివృద్ధి చేస్తాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - రామచంద్రపురం (తిరుపతి రూరల్) తిరుపతి రూరల్ మండలం పరిధిలోని అవిలాల పంచాయతీలో స్వర్ణఅవిలాల – స్వచ్ఛ అవిలాలగా తీర్చిదిద్దడమే నా ప్రధాన లక్ష్యం అని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. శనివారం అవిలాల గ్రామంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర, గ్రామసభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీపీఓ సుశీలాదేవి, డిఎల్పిఓ సురేష్ నాయుడు, ఎంపీడీవో కె.రామచంద్ర, సర్పంచ్ సి వెంకటరమణ , టీడీపీ నాయకులు సుధాకర్, గోపాల్ జిల్లా,మండల స్థాయి అధికారులు,ప్రజా ప్రతినిధులు, గ్రామ ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

వాడి వేడిగా మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - సత్యవేడు : గ్రామ సర్పంచులకు తెలియకుండా పంచాయతీ రికార్డులను పరిశీలించే అధికారం పంచాయతీరాజ్ విస్తరణాధికారికి లేదని తిరుపతి జిల్లా సత్యవేడు మండలం రాజగోపాలపురం సర్పంచ్ మధురాజు స్పష్టం చేశారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ప్రతిమ అధ్యక్షతన, ఎంపీడీవో చంద్రశేఖర్ పర్యవేక్షణలో మండల సర్వసభ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వాదోపవాదాలు వివిధ సమస్యలపై జరిగాయి. ఈ సమావేశంలో మండల పరిషత్ కోఆప్షన్ సభ్యులు మస్తానమ్మ, ఎంపీటీసీ బాలయ్య,ఇంద్రాణి,సర్పంచులు బాబు, శివరంజని, తెలుగు గంగ డిఈ శ్రీహరి, వెలుగు ఏపీఎం డాక్టర్ డాంగే యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల వాల్ పోస్టర్లు విడుదల

ప్రజాశక్తి - క్యాంపస్ :తిరుపతిలోని ఎబివిపి జిల్లా శాఖ ఆధ్వర్యంలో మార్చి 26న జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో జరగబోయే జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు పోస్టర్లను శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ శివశంకర్ రెడ్డి, దక్షిణ మధ్య క్షేత్ర సంఘటన మంత్రి శివ కుమార్, ప్రాంత సంఘటన మంత్రి సుమన్ చేతుల మీదుగా విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జాతీయ కార్యవర్గ సభ్యులు పూజారి రాఘవేంద్ర, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సురేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

పాత వాహనాలు వేలం వెయ్యండి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - క్యాంపస్ : ఎన్నో సంవత్సరాలుగా మూలన పడేసిన వాహనాలు ఎస్వీయులో తుప్పు పట్టి పోతున్నాయని, కొన్ని పార్ట్స్ దొంగతనానికి గురవుతున్నాయని, వీటికి వేలం పాట నిర్వహించి, వాటిద్వారా వచ్చే డబ్బులు యూనివర్సిటీ అభివృద్ధికి ఖర్చు చెయ్యాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర యూనివర్సిటీల కో–కన్వీనర్ అశోక్ కుమార్ శనివారం అధికారులను కోరారు. పాత వాహనాలని వేలం వేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల విద్యార్థుల సంఘాలతో వేలం నిర్వహించేవరకు పోరాడుతామని హెచ్చరించారు.

రేణుక పరమేశ్వరిని దర్శించుకున్న మేయర్ దంపతులు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: తిరుపతి నగరంలో విశేష భక్తిశ్రద్ధలతో నిర్వహించబడుతున్న శ్రీ రేణుకా పరమేశ్వరి అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తుల ఉత్సాహం మధ్య అద్భుతంగా కొనసాగుతున్నాయి. ఈ పవిత్ర కార్యక్రమంలో తిరుపతి మేయర్ శిరీష దంపతులు ప్రత్యేకంగా హాజరై అమ్మవారిని దర్శించుకొని, పూజా కార్యక్రమాల్లో హాజరాయ్యారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, తిరుపతి భక్తి, మతసామరస్యానికి నిలయం అని, ఇలాంటి ఉత్సవాలు సాంప్రదాయాలను ముందుకు తీసుకెళ్లే మహోత్సవాలుగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో ఇలాంటి ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలకు మరింత మద్దతునందించనున్నట్లు తెలిపారు.